

మరో నాలుగు రోజులు వడగాడ్పులు

● ఎల్లుండికి ఎల్లో అలెర్ట్ జారీ



చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం నుంచి నాలుగు రోజులపాటు వడగాడ్పులు వీస్తాయని, పగటిపూట ప్రజలు ఇంటిపట్టునే ఉండటం శ్రేయస్కరమని వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరించింది. అంతే కాకుండా ఈ నెల 30న పగటిపూట ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉండటంతో ఆ రోజుకు సంబంధించి ఎల్లో అలెర్ట్ జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో ఉపరితల ఆవర్తనం, పడమటి గాలుల దిశలో మార్పు తదితర కారణాల వల్ల పగటి ఉష్ణోగ్రత పెరుగుతుందని, రాష్ట్రంలోనే కాకుండా పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో వేడి గాలులు వీస్తాయని, ఆ ప్రాంతాల్లో 38.8 డిగ్రీల (102డిగ్రీల ఫారెన్‌హీట్) నుండి 42.7 డిగ్రీల (109 డిగ్రీల ఫారెన్‌హీట్) వరకు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు పేర్కొన్నారు. రాజధాని నగరం చెన్నై సబర్బన్ ప్రాంతాల్లో రెండు రోజుల పాటు పగటి ఉష్ణోగ్రత పెరిగిన సాయంత్రానికి సముద్రపు గాలులు వీచే అవకాశం ఉందని, ఫలితంగా సాయంత్రం ఆరుతర్వాతే నగరంలో వాతావరణం కాస్త చల్లబడుతుందని తెలిపారు. ఈ నెల 30 వడగాడ్పులు అధికం కానుండటంతో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పిల్లలు, వృద్ధులు ఇంటిపట్టునే గడపాలని హెచ్చరించారు. మండుటెండలో నడిచి వెళితే వడ దెబ్బ తగిలే ప్రమాదం కూడా ఉందని తెలిపారు.

1000 చోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్లు..

ఇదిలా ఉండగా రాష్ట్రంలో తీవ్రమవుతున్న ఎండల కారణంగా దేహంలో తడి తగ్గి ప్రజలు సొమ్మసిల్లి పడిపోయే అవకాశం ఉండటంతో అలాంటి వ్యక్తులకు ఓఆర్ఎస్ (ఓరల్ డీహైడ్రేషన్ సాల్ట్స్) ప్యాకెట్లు పంపిణీ చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఆ మేరకు రాష్ట్రంలో 1000 చోట్ల ఉప్పు, చక్కెర మిశ్రమంతో కూడిన ప్యాకెట్లను జూన్ 30 వరకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.



సచివాలయంలో నీటి సమస్య పరిష్కారానికి అధికారులతో సమావేశమైన సీఎం స్టాలిన్

నీటి ఎద్దడిపై సీఎం సీరియస్

● 22 జిల్లాల్లో నీటి సరఫరాకు రూ.150 కోట్లు

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమష్టిగా నీటి యెద్దడిని నివారించే చర్యలు చేపట్టాలని, ఈ వేసవిలో తీవ్ర మంచినీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉండటంతో యుద్ధప్రాతిపదికన నీటి సరఫరా చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సూచించారు. సచివాలయంలో శనివారం ఉదయం రాష్ట్రంలో ప్రజలకు నిరాటంకంగా తాగునీరు సరఫరా చేసే విషయంపై సమగ్రంగా చర్చించేందుకు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో సీఎం మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 22 జిల్లాల్లో నీటి యెద్దడి తీవ్రరూపం దాల్చనుండటంతో ఆ జిల్లాలకు రూ.150 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఆయా ప్రాంతాల్లో బోరుబావులు, చెరువుల ద్వారా లభిస్తున్న నీటిని శుద్ధీకరించి అవసరమైతే ట్యాంకర్లలో రోజూ సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సముగ్ర మంచినీటి పథకం ద్వారా ఏమేరకు తాగునీరు సరఫరా చేస్తున్నారనే విషయంపై అధికారులు పరిశీలించాలని ఆయన కోరారు. ఈ వేసవిలో ప్రధానంగా రెండు సమస్యలు ఎదురవుతున్నాయని, ఒకటి ఎండవేడి కారణంగా ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయి దాటడం, రెండోది తాగునీటి అవసరాల పెంపు అని తెలిపారు.

పగటిపూట ఎండ తీవ్రత, వడగాడ్పుల గురించి రెండు రోజులకు ముందు అధికారులతో సమీక్ష జరిపానని, ఎండ వేడి నుంచి ఎలా కాపాడుకోవాలనే విషయమై ప్రకటన కూడా చేశానన్నారు. గత డిసెంబర్, జనవరి నెలల్లో సముద్రతీర జిల్లాల్లో భారీగా వర్షాలు కురిసినా, ప్రధాన జలాశయాల వద్ద నీటిపరివాహక ప్రాంతాల్లో వర్షాలు తక్కువగానే కురిశాయని, దీంతో తాగునీటి కొరత తీవ్ర రూపం దాల్చనుందన్నారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా కూడా ఆశించినంత మేర వర్షాలు కురవలేదని, ఈ కారణంగానే ప్రస్తుతం ప్రధాన జలాశయాల్లో నీటిమట్టం క్రమంగా తగ్గుతోందన్నారు. నగరపాలక, విద్యుత్, నీటివనరుల శాఖ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు సమష్టిగా నీటియెద్దడి నివారణ చర్యలు చేపట్టాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మంచినీటి కొరతను తీర్చేందుకు నగరపాలక శాఖ ఉన్నతాధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్ళి, పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. బోరుబావుల తవ్వకాల వల్ల నీటి సమస్యను పరిష్కరించే అవకాశాలున్న ప్రాంతాలపై కూడా అధికారులు పరిశీలన జరపాలన్నారు. ఈ సమావేశంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఐ. పెరియసామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, నీటివనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సందీప్ సక్సేనా, రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఛైర్మన్ రాజేష్ లఖానీ, నగరపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి. కార్తికేయన్, రాష్ట్ర తాగునీటి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి. దక్షిణా మూర్తి, చెన్నై మెట్రో వాటర్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ టీజీ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కొడైకెనాల్‌కు స్టాలిన్

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 29న ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్ వెళ్తున్నారు. స్టాలిన్ మొదట మాల్దీవులకు వెళ్ళాలనుకున్నారని, ఏవో కారణాల వల్ల ఆ ఆలోచన విరమించుకుని కొడైకెనాల్ బయలుదేరుతున్నారని ఆయన సన్నిహితులు తెలిపారు. గత శాసనసభ ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా స్టాలిన్ కుటుంబ సమేతంగా కొడైకెనాల్‌లో కొద్ది రోజులు బసచేశారు. ఆ ఎన్నికల్లో డీఎంకే గెలిచి ఆయన ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. ఆ రీతిలోనే లోక్‌సభ ఎన్నికల్లోనూ గెలుపొందగలమనే ధీమాతో ఆయన ఈసారి కూడా కొడైకెనాల్ పర్యటన ఎంచుకున్నారు. 2021లో కొడైకెనాల్‌లో కుటుంబ సమేతంగా బసచేసిన పాంబరపురంలోని గెస్ట్‌హౌస్‌లోనే ఆయన బసచేయనున్నారు. మే నెల నాలుగో తేదీ వరకూ అయన కుటుంబ సభ్యులతోపాటు కొడైకెనాల్ లోనే బసచేయనున్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కల్పించే విషయమై దిండుగల్ జిల్లా కలెక్టర్ పూంగొడి, డీఐజీ అభినవ్, ఎస్పీ ప్రదీప్ కొడైకెల్ ఆర్డీవో, ఇతర అధికారులు శనివారం సమావేశమై చర్చలు జరిపారు.



తిరుమలేశుడి సేవలో సీఎం స్టాలిన్ సతీమణి

తిరుమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని.. తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. అనంతరం దుర్గా స్టాలిన్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు.

వరద సాయంలో వివక్ష

నిధుల కేటాయింపులో కేంద్రం నిర్లక్ష్యవైఖరి

అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి



మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, ఏప్రిల్ 27: ప్రకృతి వైపరీత్యాలు సంభవించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమయంలో రాష్ట్రానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించకుండా నిర్లక్ష్యం చూపుతోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. 'మిచౌంగ్' తుపాను కారణంగా రాష్ట్రంలో చేపట్టాల్సిన పునరుద్ధరణ పనులు, బాధితులకు అందించాల్సిన ఆర్థికసాయం తదితరాల కోసం కేంద్రం రూ.276 కోట్లు మాత్రమే కేటాయించింది. దీనిని ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే తీవ్రంగా ఖండించింది. సేలం జిల్లా ఎడప్పాడి, కొండనాపురం ప్రాంతాల్లో శనివారం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను పళనిస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇప్పటివరకు సంభవించిన తుపాను, వరదల్లో నష్టపోయిన బాధితులను ఆదుకొనేందుకు పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అవసరమైన నిధులను కేటాయించకుండా రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపుతోందని విమర్శించారు. అయితే బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఆ ప్రభుత్వాలు కోరిన నిధుల కంటే అదనపు నిధులు బీజేపీ ప్రభుత్వం మంజూరు చేస్తోందని వ్యాఖ్యానించారు. సక్రమంగా పన్నులు చెల్లిస్తున్న రాష్ట్రప్రభుత్వానికి న్యాయపరంగా ఇవ్వాల్సిన నిధులను డీఎంకే ప్రభుత్వం పోరాడి పొందడం లేదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న సమయంలో కూడా భాగస్వామ్యం వహించిన డీఎంకే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని విమర్శించారు.

ఈ లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలనే పొత్తుగా భావించి ఒంటరిగా పోటీచేసిన అన్నాడీఎంకే అధికస్థానాల్లో గెలుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వాతావరణంలో కలిగిన మార్పుల కారణంగా రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పలు జిల్లాల్లో రాత్రి సమయాల్లో కరెంట్ కోత నెలకొనడంతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని, ఈ సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో సేలం జిల్లాలోని మేట్టూరు డ్యాంలో పూడిక తీత పనులకు సమగ్రమైన ప్రణాళిక రూపొందించామని అయితే, ప్రభుత్వం మారిన అనంతరం ఈ పథకాన్ని రాష్ట్రప్రభుత్వం అటకెక్కించిందన్నారు. డెల్టా జిల్లాల రైతులు, ప్రజల కోరిక మేరకు మేట్టూరు డ్యాంలో పూడికతీత పనులు నిర్వహించాలని, అలాగే సంయుక్త నీటి పథకాన్ని పునరుద్ధరించి వర్షాకాలంలో నదులు, చెరువుల్లో నీటినిల్వలు పెంచేలా ప్రభుత్వం వసతులు కల్పించాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.



త్యాగరాయ శ్రేష్ఠికి రాష్ట్ర ప్రభుత్వం తరపున నివాళులర్పిస్తున్న సమాచార శాఖ డైరెక్టర్ వైద్యనాథన్, ఎల్.సుబ్రమణ్యన్ తదితరులు

త్యాగరాయ శ్రేష్ఠికి ఘననివాళి

ప్యారీస్, ఏప్రిల్ 27: మద్రాసు ప్రిసీడియం ప్రథమ మేయర్, స్వాతంత్ర్య సమర యోధుడు, తెలుగు ప్రముఖుడు సర్ పిట్టి త్యాగరాయ శ్రేష్ఠి 173వ జయంతి వేడుకలను శనివారం నగరంలో ఘనంగా జరుపుకున్నారు. నగర కార్పొరేషన్ భవనం రిప్పన్ బిల్డింగ్ ప్రాంగణంలో ఉన్న త్యాగరాయ శ్రేష్ఠి విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన ఆయన చిత్రపటానికి రాష్ట్రప్రభుత్వం తరపున తమిళాభివృద్ధి, సమాచార శాఖ కార్యదర్శి ఎల్.సుబ్రమణ్యన్, డైరెక్టర్ ఆర్.వైద్యనాథన్, ప్రభుత్వ ఉన్నతాధికారులు నివాళులర్పించారు. అలాగే, రామలింగం చెట్టియార్ ట్రస్ట్ తరపున నిర్వాహకులు బాలాజీ రామలింగం, కె.సత్యమూర్తి, ఎ.శశి, ఇ.నాగేష్ పాల్గొని పుష్పాంజలి ఘటించారు.

త్యాగరాయ ఉద్యానవనంలో...

సర్ త్యాగరాయ కళా పరిషత్ ఆధ్వర్యంలో వాషర్‌మెన్‌పేట మన్నప్ప మొదలి వీధిలోని ఉన్నత పాఠశాల నుంచి ఆయన చిత్రపటంతో ఊరేగింపుగా బయల్దేరి టీహెచ్ రోడ్డులో ఉన్న త్యాగరాయ ఉద్యానవనానికి చేరుకున్నారు. అక్కడ అలంకరించిన త్యాగరాయ శ్రేష్ఠి చిత్రపటానికి, విగ్రహానికి పరిషత్ ప్రధాన కార్యదర్శి హరికృష్ణ జక్కుల, కార్యదర్శి శ్రీదేవి మాధవయ్య, సభ్యులు ఎర్రా ఈశ్వరయ్య, వి.గజలక్ష్మి, బాలాజీ లవిశెట్టి, గొట్టిముక్కల సీతమ్మ, లావణ్య, జక్కుల శోభారాణి, నాగలక్ష్మి యుగంధర్ తదితరులు పుష్పాంజలి ఘటించారు.



వాషర్‌మెన్‌పేటలో త్యాగరాయ కళాపరిషత్ ఆధ్వర్యంలో త్యాగరాయ శ్రేష్ఠి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పరిషత్ నిర్వాహకులు

తుపాను నష్టపరిహారం రూ.682 కోట్లు

తక్షణమే రూ.275 కోట్లు విడుదల ● ఎట్టకేలకు కేంద్రం నుంచి నిధులు

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మిచౌంగ్ తుపాను, వరద బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు ఎట్టకేలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. తుఫాను , వరదలకు రూ.682 కోట్ల మేర నిధులు కేటాయించి, తక్షణ సహాయంగా రూ.275 కోట్లు విడుదల చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. గత డిసెంబర్, జనవరి నెలల్లో చెన్నై సహా నాలుగు జిల్లాల్లో మిచౌంగ్ తుఫాన్, తిరునల్వేలి సహా నాలుగు జిల్లాల్లో వర్షబీభత్సం కారణంగా ఏర్పడిన వరద పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పించి రూ.38 వేల కోట్ల మేరకు నిధులు విడుదల చేయాలని కోరింది. అయితే కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుల నిర్వహణ నిధి నుంచి మిచౌంగ్ తుఫానుకు రూ.115.49 కోట్లు, తిరునల్వేలి, తూత్తుకుడి వరదలకు రూ.180.61 కోట్ల మేర నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుంది. ఈ విషయమై డీఎంకే ఎంపీల బృందం ప్రధాని మోదీని పలుమార్లు కలిసి తుఫాను, వరద ప్రాంతాల్లో పునరావాస చర్యలకు రూ. 38 వేల కోట్ల మేర విడుదల చేసి ఆదుకోవాలని వినతి పత్రాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి వర్గం రాష్ట్రంలో మిచౌంగ్ తుపాను, వరద ప్రాంతాల్లో సహాయక చర్యలకు రూ.682 కోట్లు కేటాయించి, తక్షణ సహాయంగా రూ.275 కోట్లు విడుదల చేయడంపై పాలక, ప్రతిపక్ష నేతలు కేంద్రంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్నాడీఎంకే సీనియర్ నేత డి.జయకుమార్ నగరంలో మీడియాతో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాష్ట్రానికి చాలినంత నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించిన దాఖలాలే లేవని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా నిధుల కేటాయింపుల విషయంలో మాత్రం సవతి తల్లి ప్రేమనే ప్రదర్శిస్తుందని విమర్శించారు.

ఓటమి భయం వల్లే...

లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల్లో చేస్తున్న ప్రచారానికి ఉపయోగపడుతుందని, రాష్ట్రానికి రూ. 682 కోట్ల మేరకు తుఫాను, వరద సహాయాలను ప్రకటించింబదని డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి ఆరోపించారు. మిచౌంగ్ తుఫాన్ రాష్ట్రాన్నే కుదిపేసిందని, తిరునల్వేలి, తూత్తుకుడి సహా నాలుగు జిల్లాల్లో వర్షబీభత్సానికి అపార నష్టం కలిగిందని, రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు ఆర్థికసాయం అందించటమే కాకుండా పునరావాస చర్యలకు సైతం భారీగా నిధులు విడుదల చేసిందన్నారు. ఎనిమిది జిల్లాల్లో తుఫాన్, వరద ల నష్టపరిహారంగా రూ.38వేల కోట్లు కావాలని అడిగినా కేంద్రంలోని బీజేపీ అత్యల్పంగా నిధులు కేటాయించి, అందులో తక్షణ సహాయంగా అతి తక్కువగా విడుదల చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇదెక్కడి న్యాయం?

అడిగింది రూ. 37,907 కోట్లు, ఇచ్చింది రూ.275 కోట్లు

కేంద్రంపై సీఎం స్టాలిన్ ధ్వజం

మిచౌంగ్ తుపాను, వరదలకు రూ.37,097 కోట్ల మేరకు నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తే కేంద్రం రూ.275 కోట్ల విదిల్చి చేతులు దులుపుకుందని, ఈ నిధులను సుప్రీం కోర్టులో కేసు వేయడం వల్లే విడుదల చేశారని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. మిచౌంగ్ తుపాను తాకిడికి గురైన చెన్నై సహా నాలుగు జిల్లాల్లో, ఆ తర్వాత తిరునల్వేలి, తూత్తుకుడి సహా నాలుగు జిల్లాల్లో వరదల సంభవిస్తే కేంద్రం నుండి నిధులు రావని తెలిసి తమ ప్రభుత్వం రూ 2477 కోట్లతో బాధితులను ఆదుకుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం విడుదల చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటూ నిధులు రావని, న్యాయమూ జరుగదని ఆయన యెద్దేవా చేశారు.

రాష్ట్రంపై బీజేపీ ప్రభుత్వానికి ద్వేషం

● సీపీఎం ఎంపీ వెంకటేశన్

పెరంబూర్, ఏప్రిల్ 27: తమిళనాడుపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఉన్నది కోపం కాదని, ద్వేషమని మదురై సీపీఎం ఎంపీ వెంకటేశన్ విమర్శించారు. తుపాను, వరదలతో నష్టపోయిన రాష్ట్రానికి నివారణ నివారణ నిధులుగా రూ.275 కోట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయమై ఎంపీ వెంకటేశన్ తన 'ఎక్స్'లో... కర్ణాటక రాష్ట్రంలో మొదటి దశ ఎన్నికల్లో తమకు అనుకూలంగా లేవని గ్రహించిన బీజేపీ, ఆ రాష్ట్రానికి నివారణ నిధులు రూ.3,454 కోట్లు కేటాయించిందన్నారు. అదే సమయంలో భారీ తుపాను, వరదలతో చిన్నాభిన్నమైన తమిళనాడు ప్రభుత్వం దాదాపు రూ.38,000 కోట్లు నివారణ నిధులు అందించాలని కోరగా, కేవలం రూ.275 కోట్లు ప్రకటించి చేతులు దులుపుకున్నారని, తమిళనాడుపై బీజేపీకి ఉన్నది కోపం కాదు...ద్వేషమని ఎంపీ వెంకటేశన్ ఆరోపించారు.

ఆర్ట్స్, సైన్స్ కాలేజీల్లో డేటా టెక్నాలజీ కోర్సులు

● మద్రాసు వర్సిటీ ప్రకటన



ప్యారీస్, ఏప్రిల్ 27: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీల్లో డేటా టెక్నాలజీ కోర్సులు పరిచయం చేయనున్నట్లు మద్రాసు వర్సిటీ ప్రకటించింది. ఇటీవల కాలంలో డేటా సైన్స్ కోర్సుపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆ కోర్సు చేస్తే భవిష్యత్తు బాగుంటుందని ఆ కోర్సుల్లో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని 2024-25 విద్యా సంవత్సరంలో తన నిర్వహణలో ఉన్న 24 ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుతో డేటా టెక్నాలజీ కోర్సులు కలపాలని మద్రాసు వర్సిటీ నిర్ణయించింది. మరికొన్ని కళాశాలల్లో బీబీఏ, బీఎస్సీ సైకాలజీ కోర్సుల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని నిర్ణయించింది. ఆ విధంగా బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ డేటా సైన్స్ పాఠ్యాంశం, మాస్టర్ ఆఫ్ సోషియల్ వర్క్‌లో నూతన పీజీ కోర్సులు ప్రారంభించేందుకు నుంగంబాక్కంలోని మద్రాసు మహిళా క్రిస్టియన్ కళాశాల యాజమాన్యం నిర్ణయించింది. అదే విధంగా స్టెల్లా మేరీస్ కళాశాలలో ఎంఏ కమ్యూనికేషన్ (ఆంగ్లం), ఎంఎస్సీ (ఫుడ్ కేటరింగ్) కోర్సులను రాబోయే విద్యా సంవత్సరం నుంచి పరిచయం చేయనున్నట్లు మద్రాసు వర్సిటీ తన ప్రకటనలో వెల్లడించింది.

శ్రీరంగంలో నేడు చిత్తిరై ఉత్సవాలు ప్రారంభం

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లాలో సుప్రసిద్ధ వైష్ణవ దివ్యదేశం శ్రీరంగం రంగనాథస్వామివారి ఆలయ చిత్తిరై రథోత్సవాలు ఆదివారం ధ్వజారోహణంతో ప్రారంభమవుతున్నాయి. దీంతో శనివారం సాయంత్రం రథంలో ముహూర్త స్తంభ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ ముహూర్త స్తంభంపై పవిత్రజలాలు చల్లి చందనం పూసి, స్తంభ కొసన పూలమాలను కట్టి మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు జరిపారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.30 గంటలకు కటకలగ్నంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ మారియప్పన్ ఇతర అధికారులు రథంపై ముహూర్త స్తంభాన్ని నాటారు. ఆ సమయంలో ఆలయ ఏనుగులు ఆండాళ్, లక్ష్మీ తొండాలు పైకెత్తి ఘీంకరించాయి. ఆదివారం వేకువజాము 3.30 గంటలకు నంబెరుమాళ్ మూలస్థానం నుంచి బయలుదేరి వేకువజాము 3.45 గంటలకు ధ్వజస్తంభ మండపానికి చేరుకుంటారు. వేకువజాము 5.30 గంటల నుంచి ఉదయం 6.15 గంటలలోపున మేషలగ్నంలో ధ్వజారోహనం చేయనున్నారు. ఉదయం 7.30 గంటలకు నంబెరుమాళ్ ధ్వజస్తంభ మండపం నుంచి బయలుదేరి ఉదయం 7.45 గంటలకు అద్దాల గది చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల దాకా భేరితాటనం నిర్వహించనున్నారు. ఆ తర్వాత సాయంత్రం 6.30 గంటలకు నంబెరుమాళ్ బయలుదేరి చిత్తిరై వీధుల్లో ఊరేగి రాత్రి 8.30 గంటలకు చందన మంటపానికి చేరుకుంటారు. సోమవారం నుంచి ప్రతిరోజూ వివిధ వాహనాలలో స్వామివారు ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ ఉత్సవాల్లో అత్యంత కీలకఘట్టమైన రథోత్సవం మే 6న నిర్వహించనున్నారు.



ఆలయ రథంపై ముహూర్త స్తంభ స్థాపన జరుపుతున్న అధికారులు, అర్చకులు

సమాచార ధ్వని

వెబ్‌సైట్‌లో 'నీట్' కేంద్రాల వివరాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: 'నీట్' పరీక్షా కేంద్ర వివరాలను జాతీయ పరీక్ష ఏజెన్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేసింది. దేశవ్యాప్తంగా వైద్య కోర్సుల్లో అడ్మిషన్లకు నీట్ నిర్వహిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరం నీట్ పరీక్ష మే 5న జరుగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు ఫిబ్రవరి 9వ తేది నుంచి ఈ నెల 10వ తేది వరకు జరిగింది. 13 భాషల్లో జరుగనున్న ఈ పరీక్షకు 23 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష జరుగనున్న కేంద్రాల వివరాలను జాతీయ పరీక్ష ఏజెన్సీ www.neet.nta.nic.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేసింది. ఇతర వివరాలకు 011-40759000/69227700 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

శిలాశాసన పరిశోధకులకు పురస్కారాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: శిలాశాసన పరిశోధకులకు అందజేసే 'వి.వెంకయ్య' పురస్కారానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తమిళ పారంపర్య ట్రస్ట్ నిర్వాహకులు తెలియజేశారు. కేంద్ర పురావస్తు శాఖలో మొదటి శిలాశాసన పరిశోధకులుగా పనిచేసి పలు విజయాలు సాధించిన వి.వెంకయ్య స్మారకార్థం 2022 నుంచి ఆయన పేరుతో పురస్కారాలు అందజేస్తున్నారు. దేశంలో ఇంత వరకు గుర్తించనివి, రిజిస్టర్ చేయని శిలాశాసనాలు పరిశోధించి, వాటి చరిత్రను వెల్లడిపరిచే వారికి ఈ పురస్కారం అందజేస్తున్నారు. ఏ భాష శిలా ఫలక పరిశోధకులైనా మే 21వ తేదిలోపు awards.tht@gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాకు వివరాలు నమోదుచేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9500074247 నెంబరు సంప్రదించాలన్నారు.

త్వరలో నిరక్షరాస్యుల గణన

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: చదవడం, రాయడం తెలియని 15 ఏళ్ల పైబడిన వారి వివరాలు త్వరలో సేకరించంచనున్నట్లు అధికారులు తెలిపారు. పుదియ భారత ఎళుత్తరివు పథకం కింద రాష్ట్రంలో 15 ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి వారికి విద్యా బోధన కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా ప్రధాన విద్యాధికారులు తమ జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యుల వివరాలను మే మొదటి వారంలో సేకరించాలని నిరక్షరాస్యుల, వయోజన విద్య శాఖ డైరెక్టర్ నాగరాజ మురుగన్ ఉత్తర్వులు జారీచేశారు.

ఆహార పదార్థాల ప్యాకింగ్‌కు నైట్రోజన్ వాడొచ్చు

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: ఆహార పదార్థాలు ప్యాకింగ్ చేసేందుకు లిక్విడ్ నైట్రోజన్‌ను వినియోగించేందుకు అనుమతిచ్చినట్లు ఆహార భద్రతా శాఖ అధికారులు తెలిపారు. ఇటీవల స్మోక్ బిస్కెట్ల తయారీలో ద్రవ రూప నైట్రోజన్ వినియోగించడాన్ని ఆహార భద్రతా శాఖ నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, పాలు, పెరుగు, పండ్ల రసాలు వంటి ఆహార పదార్థాల ప్యాకింగ్‌కు మాత్రం నైట్రోజన్ వినియోగాన్ని అనుమతించినట్లు పేర్కొంది.

జూన్‌లో గ్రామసభలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: ఎన్నికల నిబంధనలు అమలులో ఉండడంతో మే 1న జరగాల్సిన గ్రామసభలను జూన్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అన్ని పంచాయతీల్లో జనవరి 26, మార్చి 22, మే 1, ఆగస్టు 15, అక్టోబరు 2, నవంబరు 1 తేదీల్లో గ్రామసభలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఎన్నికల నిబంధనలు అమలులో ఉండడంతో శ్రామిక దినమైన మే 1వ తేది జరగాల్సిన గ్రామసభలను జూన్‌కు వాయిదావేశారు.

రైల్వేస్టేషన్‌లో ఆటోమేటిక్ టిక్కెట్ యంత్రాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: చెన్నై ఎగ్మూర్, తాంబరం సహా 47 రైల్వేస్టేషన్లలో ఆటోమేటిక్ టిక్కెట్ యంత్రాలు ఏర్పాటుచేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. రైల్వేస్టేషన్లలో టిక్కెట్ కౌంటర్ల వద్ద రద్దీని నియంత్రించేలా ఆటోమేటిక్ టిక్కెట్ మెషీన్లను ఏర్పాటుచేస్తున్నారు. చెన్నై రైల్వే డివిజన్‌లో 34, మదురైలో 16 సహా ఆరు డివిజన్లలో ఇదివరకే వంద యంత్రాలు ఏర్పాటుచేశారు. మరో విడతగా 47 రైల్వేస్టేషన్లలో 100 మెషీన్లు ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు. తాంబరంలో ఆరు, ఎగ్మూర్‌లో నాలుగు, పెరంబూర్ నాలుగు, మాంబళం ఆరు, వేళచ్చేరి ఐదు, గిండి ఐదు, మిగిలిన స్టేషన్‌లలో 1 నుంచి 3 యంత్రాలు ఏర్పాటుచేయనున్నారు.

3న ఎస్ఎంసీ సమావేశం

పెరంబూర్, ఏప్రిల్ 27: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మే 3వ తేది స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) సమావేశం నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పాఠశాలల్లో బోధన, వసతులు మెరుగు తదితరాలు చర్చించేందుకు ప్రతినెలా ఎస్ఎంసీ సమావేశం నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు కావడంతో మే 3వ తేది మధ్యాహ్నం 3 నుంచి సమావేశం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మజ్జిగ, లస్సీ ఉత్పత్తులను పెంచిన ఆవిన్

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: ఈ వేసవిలో మజ్జిగ, పెరుగు, లస్సీ వంటి పాల పదార్థాల ఉత్పత్తిని ఆవిన్ సంస్థ 20 శాతం పెంచింది. ఈ సంస్థ పాలు మాత్రమే కాకుండా వెన్న, నెయ్యి, ఐస్‌క్రీమ్ వంటి 280కి పైగా పదార్థాలు తయారుచేసి విక్రయిస్తోంది. ఆవిన్ పార్లర్లలో మాత్రమే కాకుండా ప్రైవేటు దుకాణాలు, సూపర్ మార్కెట్లలో ప్రతి నెల రూ.60 కోట్లకు పైగా ఈ పదార్థాల విక్రయాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, పెరుగు, మజ్జిగ, లస్సీ, చాకో లస్సీ, మ్యాంగో లస్సీ, మిల్క్‌షేక్, యూగర్ వంటి వాటి ఉత్పత్తిని 20 శాతం మేర పెంచింది.

29న పీఎఫ్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: చెన్నై, పుదుచ్చేరి మండల కార్మికుల భవిష్య నిధి కార్యాలయం ఆధ్వర్యంలో తిరువళ్లూర్, పుదుచ్చేరి సహా 9 ప్రాంతాల్లో ఈ నెల 29వ తేది ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పీఎఫ్ గ్రీవెన్స్ జరుగనుంది. తిరువళ్లూర్ జిల్లా పరిధిలో అంబత్తూర్ సిడ్కో ఎస్టేట్ సాయిమీరా ఇన్నోఫారమ్ సంస్థ, కాంచీపురం జిల్లా పరిధిలో ఒరగడం సిప్కాట్‌లో ఉన్న ఆటోనియం సంస్థ, చెంగల్పట్టు జిల్లా పరిధిలో ప్రొఫెసర్ ధనపాలన్ సైన్స్, మేనేజ్‌మెంట్ కళాశాల, వేలూరు జిల్లాలో నారాయణి విద్యాలయ మెట్రిక్యులేషన్ పాఠశాల సహా ఆయా ప్రాంతాల్లో జరుగనుందని తెలిపింది. ఈ శిబిరంలో పీఎఫ్ చందాదారులు, సంస్థలు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కార్యాలయం సూచించింది.

కల్లభిరాన్ ఆలయంలో నేడు చిత్రోత్సవాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: నవ తిరుపతుల్లో ఒకటైన తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం కల్లభిరాన్ ఆలయ చిత్తిరై ఉత్సవాలు ఆదివారం ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. తామ్రభరణి నదీతీరంలోని ఈ ఆలయంలో ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే చిత్తిరై ఉత్సవాలు మే 8వ తేది వరకు జరుగనున్నాయి. 2వ తేది గరుడసేవ, 8వ తేది రథోత్సవం నిర్వహించనున్నారు. ఇతర వివరాలకు 04639-272233, 256476 నెంబర్లు సంప్రదించవచ్చు.

సంవత్సరానికి రెండు బోర్డు పరీక్షలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏడాదికి రెండు సార్లు బోర్డు పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ (ఎంఓఈ) కొత్త పాఠ్య పథకం ప్రకారం విద్యార్థులకు ఏడాదికి రెండు సార్లు బోర్డు పరీక్షలు నిర్వహించనున్నట్లు 2023లో ప్రకటించింది. అయితే ఈ పథకాన్ని ఇప్పటివరకు అమలుపరచలేదు. ఈ నేపథ్యంలో, 2025-26 విద్యా సంవత్సరంలో ఈ పథకాన్ని అమలుపరచనున్నారు. దీనికి సంబంధించి ఎంఓఈ సీబీఎస్ఈ, సంయుక్తంగా మే నెలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం జరుపనున్నట్లు అధికారులు తెలిపారు.

కెమెరాలుంటేనే బస్సులకు అనుమతి

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: ప్రైవేటు పాఠశాలల వాహనాల్లో సీసీ కెమెరాలు, భద్రతా ఏర్పాట్లు ఉంటేనే అనుమతివ్వనున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు నిబంధనలు విధించారు. కొత్త విద్యా సంవత్సరం జూన్ 1న ప్రారంభం కానున్న నేపథ్యంలో, ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రెన్యువల్, బస్సుల అనుమతి కోసం ప్రైవేటు పాఠశాలల డైరెక్టరేట్‌లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. పాఠశాలల్లో మౌలికవసతులు, ఉపాధ్యాయ నియామకాల్లో పారదర్శకత, పాఠశాలల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానం వంటి ఆధారంగా అనుమతిస్తున్నారు. వాహనాలకు లైసెన్స్ రెన్యువల్ చేసుకున్నప్పటికీ కోర్టు ఉత్తర్వుల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తేనే అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

ర్యాగింగ్ నియంత్రించని విద్యాసంస్థలపై చర్యలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: ర్యాగింగ్ నిరోధక నిబంధనలు పాటించని ఉన్నత విద్యాసంస్థలపై కఠినచర్యలు చేపట్టనున్నట్లు యూజీసీ హెచ్చరించింది. ర్యాగింగ్‌ను నేరంగా పరిగణిస్తూ యూజీసీ, దాన్ని అడ్డుకొనేందుకు ఉన్నత విద్యాసంస్థలకు నిబంధనలు జారీచేసింది. కొత్త విద్యా సంవత్సరంలో చేరే విద్యార్థుల పట్ల సీనియర్లు ర్యాగింగ్ చేయడాన్ని అడ్డుకొనేందుకు చర్యలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించే కళాశాలలు, విశ్వవిద్యాలయాలపై చర్యలు చేపట్టాల్సి వస్తుందని యూజీసీ హెచ్చరించింది.

2,136 మందికి రూ.247 కోట్ల రుణాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: ఎస్సీ, ఎస్టీలు వృత్తులు ప్రారంభించేందుకు గత ఏడాది ప్రారంభించిన అంబేడ్కర్ ఇండస్ట్రియల్ పయనీర్ పథకం కింద 2,136 మందికి రూ.247 కోట్లు రుణాలు అందజేశారు. రాష్ట్రప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వృత్తుల శాఖ ఎస్సీ, ఎస్టీ విభాగాలకు చెందిన వారికి వృత్తులు ప్రారంభించేందుకు సబ్సిడీతో కూడిన రుణాలు అందజేసేందుకు ఈ పథకాన్ని ప్రారంభించింది. రుణం పొందేందుకు వాణిజ్య కమిషనరేట్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 18 నుంచి 55 ఏళ్లలోపున్న అర్హులైన వారికి గరిష్ఠంగా రూ.1.50 కోట్ల రుణాలు అందజేస్తారు. గత ఆర్థిక సంవత్సరం 7,451 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో అర్హులైన 2,136 మందికి రుణాలు అందజేశారు.

విద్యార్థి అంబాసిడర్ నియామకానికి ఉత్తర్వులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: విద్యార్థి అంబాసిడర్‌ను నియమించాలని విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు యూజీసీ ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో కొత్త విద్యా విధానంపై విద్యార్థులకు అవగాహన కలిగించేలా అంబాసిడర్‌ను నియమించనున్నారు. ఈ మేరకు కళాశాలలు, వర్సిటీలకు యూజీసీ పంపిన ఉత్తర్వుల్లో, ఉత్తమ విద్యాబోధన, విద్యార్థుల నైపుణ్యం, సత్సంబంధాలు కలిగించేలా ప్రతిభావంతులైన విద్యార్థులను అంబాసిడర్లుగా నియమించాలని పేర్కొంది.

సహాయ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 27: ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో 4,000 సహాయ ప్రొఫెసర్ల పోస్టులకు దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగించారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు (టీఆర్బీ) నోటిఫికేషన్ విడుదల చేయగా, పోస్టుల భర్తీకి ఆగస్టు 4 నుంచి నాలుగు రోజులు పోటీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పోస్టులకు సంబంధించిన దరఖాస్తు స్వీకరణ మార్చి 28న ప్రారంభమై ఈ నెల 29వ తేదీతో ముగియనుంది. ఈ అవకాశాన్ని మే 15వ తేది సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తూ టీఆర్బీ శనివారం ప్రకటన విడుదల చేసింది.

టి.నగర్‌లో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 27: స్థానిక టి.నగర్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు చేపట్టనుండడంతో పోలీసులు ట్రాఫిక్ మార్పులు ప్రకటించారు.

- నార్త్ ఉస్మాన్ రోడ్డు నుంచి టి.నగర్ బస్టాండ్ మీదుగా వచ్చే వాహనాలు పనగల్ పార్క్ సమీపంలో ఉన్న ఉస్మాన్ రోడ్డు ఫ్లై ఓవర్‌పై వెళ్లేందుకు నిషేధం విధించారు. ఈ వాహనాలు ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు గుండా వెళ్లి ప్రకాశం రోడ్డు, భాష్యం రోడ్డు, త్యాగరాయ రోడ్డు, బర్కిట్ రోడ్డు మీదుగా టి.నగర్ బస్టాండ్ చేరుకోవాలి.
- బర్కిట్ రోడ్డు ముప్పారప్పన్ వీధి నుంచి మ్యాడ్లీ మీదుగా వెళ్లేందుకు బస్సులకు మాత్రమే అనుమతిచ్చారు. ఇతర వాహనాలు ముప్పారప్పన్ వీధి, మూసా వీధి, దక్షిణ దండపాణి వీధి, మన్నర్ వీధి మీదుగా ఉస్మాన్ రోడ్డు గుండా టి.నగర్ బస్టాండ్ చేరుకోవాలి.
- టినగర్ బస్టాండ్ నుంచి సైదాపేట అన్నాసాలై చేరుకొనేందుకు సౌత్ ఉస్మాన్ రోడ్డు వెళ్లి కన్నమ్మపేట చేరుకొని సౌత్ వెస్ట్ బోగ్ రోడ్డులో ప్రవేశించి సీఐటీ నగర్ 4,3 మెయిన్ రోడ్ల గుండా అన్నాసాలై చేరుకోవాలి.
- సీఐటీ నగర్ 1వ మెయిన్ రోడ్డు నుంచి నార్త్ ఉస్మాన్ రోడ్డు వెళ్లే వాహనాలు కన్నమ్మపేట జంక్షన్‌లో సౌత్ వెస్ట్ బోగ్ రోడ్డు, నారాయణ రోడ్డు, నాగేశ్వరరావు రోడ్డు మీదుగా నార్త్ ఉస్మాన్ రోడ్డు చేరుకోవాలి.
- టి.నగర్ బస్టాండ్ నుంచి నార్త్ ఉస్మాన్ రోడ్డు చేరుకొనేందుకు మ్యాడ్లీ నుంచి బర్కిట్ రోడ్డు వెళ్లి వెంకటనారాయణ రోడ్డు మీదుగా నాగేశ్వరరావు రోడ్డులో ఎడమవైపు తిరిగి నార్త్ ఉస్మాన్ రోడ్డు చేరుకోవాలి.

వందేభారత్ రైలు సేవల పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 27: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చెన్నై ఎగ్మూర్-నాగర్‌కోయిల్ మధ్య నడుపుతున్న వందే భారత్ స్పెషల్ రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06067/06068 చెన్నై ఎగ్మూర్-నాగర్‌కోయిల్-చెన్నై ఎగ్మూర్ వందే భారత్ స్పెషల్ (గురువారం) మే 2 నుంచి జూన్ 27వ తేది వరకు (9 సర్వీసులు) పొడిగించారు.
- నెం.06057/06058 చెన్నై ఎగ్మూర్-నాగర్‌కోయిల్-చెన్నై ఎగ్మూర్ వందే భారత్ స్పెషల్ (శుక్రవారం, శనివారం, ఆదివారం) మే 3వ తేది నుంచి జూన్ 30వ తేది వరకు (27 సర్వీసులు) పొడిగించారు.

కొచ్చివెల్లి-బరౌని సమ్మర్ స్పెషల్...

- నెం.06091 కొచ్చువెల్లి-బరౌని వారాంతపు ప్రత్యేక రైలు (జోలార్‌పేట, కాట్పాడి, పెరంబూర్, గూడూరు, నెల్లూరు మీదుగా) మే 4,11,18,25, జూన్ 1,8,15,22,29 (శనివారం) తేదీల్లో కొచ్చువెల్లి నుంచి ఉదయం 8 గంటలకు బయల్దేరి మూడోరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06092 బరౌని-కొచ్చువెల్లి వారాంతపు ప్రత్యేక రైలు మే 7,14,21,28, జూన్ 4,11,18,25, జూలై 2 తేదీల్లో రాత్రి 11.30 గంటలకు బరౌనిలో బయల్దేరి నాలుగోరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు కొచ్చువెల్లి చేరుకుంటుంది.

తిరుపతి మెము రైళ్ల రద్దు...

- నెం.16870 విల్లుపురం-తిరుపతి మెము ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి మే 4వ తేది వరకు రద్దు
- నెం.06693 తిరుపతి-కాట్పాడి మెము ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28 నుంచి మే 4వ తేది వరకు రద్దు.

పాక్షిక రద్దు...

- నెం.16112 పుదుచ్చేరి-తిరుపతి మెము ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి మే 4వ తేది వరకు తిరుపతికి బదులుగా తిరుచానూరు వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే, నెం.16111 తిరుపతి-పుదుచ్చేరి మెము ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28 నుంచి మే 5వ తేది వరకు తిరుపతికి బదులుగా తిరుచానూరు నుంచి బయల్దేరుతుంది.

'పోలీస్ స్టార్ ఆఫ్ ది మంత్' పురస్కారం ప్రదానం



ఎస్ఐ రాజ్‌ప్రభుకు పురస్కారం అందజేస్తున్న పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్

పెరంబూర్, ఏప్రిల్ 27: విధులు సక్రమంగా నిర్వహించిన పోలీసు అధికారులకు నగర పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'పోలీస్ స్టార్ ఆఫ్ ది మంత్' పురస్కారం ప్రదానం చేస్తున్నారు. ఈ క్రమం లో, రామాపురం ఎస్ఐ ఇ.రాజ్ ప్రభుకు 'పోలీస్ స్టార్ అవార్డు ఆఫ్ జనవరి-2024' అవార్డుకు ఎంపికయ్యారు. ఎగ్మూర్‌లోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌ప్రభుకు అవార్డు, ప్రశంసాపత్రాన్ని కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ అందజేసి అభినందించారు.

నేడు ప్రత్యేక సబర్బన్ రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 27: నగరంలో ఆదివారం జరుగనున్న ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా చింతాద్రిపేట-వేళచ్చేరి మధ్య ప్రత్యేక సబర్బన్ రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక చేపాక్కం క్రికెట్ స్టేడియంలో రాత్రి 7.30 గంటలకు చెన్నై సూపర్‌కింగ్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరుగనుంది. ఈ సందర్భంగా వేళచ్చేరి నుంచి రాత్రి 10.40, 11.05, చింతాద్రిపేట నుంచి రాత్రి 11.20, 11.45 గంటలకు ప్రత్యేక సబర్బన్ రైళ్లు నడవనున్నారు.

రేపు ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

పెరంబూర్, ఏప్రిల్ 27: చెన్నై-పంజాబ్ జట్ల మధ్య జరుగనున్న ఐపీఎల్ మ్యాచ్ టిక్కెట్ల విక్రయం ఈ నెల 29వ తేది ప్రారంభం కానుంది. మంగళవారం ఉదయం 10.40 గంటలకు ఆన్‌లైన్‌లో టిక్కెట్ల విక్రయం ప్రారంభమవుతుందని చెన్నై జట్టు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. చెన్నై సూపర్‌కింగ్స్-కింగ్స్ లెవన్ పంజాబ్ మధ్య చేపాక్కం స్టేడియంలో మే 1వ తేది రాత్రి 7.30 గంలకు మ్యాచ్ జరుగనుంది.

సహకార ఎన్నికలు నిర్వహిస్తాం

పెరంబూర్, ఏప్రిల్ 27: లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం సహకార సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని సహకార శాఖ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ తెలిపారు. పుదుకోటలో ఆయన శనివారం విలేఖరులతో మాట్లాడుతూ... సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వ ఉద్దేశమన్నారు. కానీ, ఈ ఎన్నికలు జాప్యం చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపించడం సరికాదన్నారు. సభ్యులు చేరిక, ఓటరు జాబితా నమోదు తదితరాలు పూర్తిచేసిన తర్వాత ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

30 రోజుల్లో పదవీవిరమణ ప్రయోజనాలు

పెరంబూర్, ఏప్రిల్ 27: ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందిన 30 రోజుల్లో వారికి అందాల్సిన ప్రయోజనాలు చెల్లించాలని పాఠశాల విద్య డైరెక్టర్ అరివొళి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు జిల్లా సీఈఓలు, డీఈఓలకు ఆమె సర్క్యులర్ జారీచేశారు. పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అందాల్సిన ప్రయోజనాలు రెండేళ్ల వరకు చెల్లించడం లేదనే ఫిర్యాదులందాయన్నారు. పదవీ ప్రయోజనాలు చెల్లింపుపై చేపట్టాల్సిన మార్గదర్శకాలను ఉత్తర్వులో పేర్కొన్నామన్నారు. ప్రధానోపాధ్యాయుడి పదవీవిరమణకు ముందుగా అతి అంతర్గత ఆడిటింగ్ పూర్తిచేయాలని, ఒక వేళ ఆయన నిధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడినా పదవీ విరమణ ప్రయోజనాలు ఆపవద్దని సూచించారు. సస్పెన్షన్‌కు గురైన, నిధుల అవకతవకలు పాల్పడిన, బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లి పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులకు కూడా ప్రయోజనాలు అందజేయడంలో పాటించాల్సిన మార్గదర్శకాలను పాఠశాల విద్య డైరెక్టర్ వివరించారు.

మోదీ ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలని కోరుతూ పిటిషన్

ప్యారీస్, ఏప్రిల్ 27: ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలని కోరుతూ పుదుచ్చేరి కలెక్టర్‌కు మానవ హక్కులు, వినియోగదారుల భద్రత సంఘం పిటిషన్ సమర్పించింది. ఈ సంఘం ప్రధాన కార్యదర్శి మురుగానందం అధ్యక్షతన పుదుచ్చేరిలోని కమ్యూనిటీ సంస్థల ప్రతినిధులు శనివారం ఉదయం పుదుచ్చేరి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ కులోత్తుంగన్‌కు పిటిషన్ సమర్పించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న బీజేపీ సీనియర్ నేత, ప్రధాని నరేంద్ర మోదీ కులమత ఘర్షణలు ప్రోత్సహించే విధంగా మాట్లాడుతున్నారని, మోదీపై చర్యలు చేపట్టడంతో పాటు ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలని ఆ పిటిషన్‌లో కోరారు.

6 నుంచి 8వ తరగతి వరకు ఉత్తీర్ణత తప్పనిసరి

● చెన్నై జిల్లా ప్రిన్సిపల్ విద్యాశాఖాధికారి

ప్యారీస్, ఏప్రిల్ 27: ఆరు నుంచి 8వ తరగతి వరకు చదివే విద్యార్థులను తప్పనిసరిగా ఉత్తీర్ణులుగా ప్రకటించాలని చెన్నై జిల్లా ప్రిన్సిపల్ విద్యాశాఖ అధికారి మార్క్స్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు నుంగంబాక్కం డీపీఐ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న విద్యాశాఖ కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల యజమాన్యానికి, ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు పంపించారు.. అందులో, ప్రస్తుత 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు స్వయం ప్రతిపత్తి, ఆంగ్లో ఇండియన్ పాఠశాలలు, ఆదిద్రావిడ సంక్షేమ శాఖ పాఠశాలలు, ప్రత్యేక పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల పరీక్షల ఫలితాలకు చెన్నై జిల్లా ప్రిన్సిపల్ విద్యాశాఖ నిబంధనలు విధించింది. దాని ప్రకారం, 6,7,8 తరగతుల విద్యార్థులందరినీ తప్పనిసరిగా ఉత్తీర్ణులుగా ప్రకటించి, వారికి కేటాయించిన మార్కుల జాబితా సమర్పించాలని, అలాగే 9వ తరగతి విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన మార్కులు నమోదుచేయడంతో పాటు ఫలితాలు వెల్లడించడంలో నిబంధనలు పాటించాలని మార్క్స్ విడుదల చేసిన సర్క్యులర్‌లో సూచించారు.

శ్రీలంక జైలు నుంచి 24 మంది తమిళ జాలర్ల విడుదల

ప్యారీస్, ఏప్రిల్ 27: శ్రీలంక జైలు నుంచి విడుదలైన రామనాథపురం జిల్లాకు చెందిన 24 మంది తమిళ జాలర్లు విమానం ద్వారా శనివారం నగరానికి చేరుకున్నారు. రాష్ట్రప్రభుత్వ మత్స్యశాఖ అధికారులు వారిని ఆహ్వానించి ప్రభుత్వ ఏర్పాటు చేసిన వాహనాల్లో వారిని సొంతూళ్లకు పంపించారు. రామనాథపురం జిల్లా రామేశ్వరానికి చెందిన జాలర్లు మార్చి 24వ తేది రెండు మరబోట్లలో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వారు అర్ధరాత్రి చేపలుపడుతున్న సమయంలో శ్రీలంక నావికాదళం, సముద్ర సరిహద్దులు దాటారంటూ 24 మంది తమిళ జాలర్లను అరెస్ట్ చేసి, రెండు పడవలు, వలలు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ప్రయత్నాలు ఫలించడంతో తమిళ జాలర్లు సురక్షితంగా స్వదేశానికి తిరిగొచ్చారు.

ఆమ్నీ బస్సు బోల్తా... 15 మందికి గాయాలు



బోల్తాపడిన బస్సును క్రేన్ సాయంతో తొలగిస్తున్న కార్మికులు

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కళ్ళకురిచ్చి జిల్లా ఉలుందూరుపేట సమీపంలో ఆమ్నీ బస్సు బోల్తాపడటంతో 15 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. నాగర్‌కోవిల్ నుంచి చెన్నై బయలుదేరిన ఆమ్నీ బస్సు ఉలుందూరుపేట బస్టాండు రోడ్డులో వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. భారీ క్రేన్‌లను తెప్పించి బోల్తాపడిన బస్సును తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

విద్యార్థులను శిక్షించడం నేరం

పెరంబూర్, ఏప్రిల్ 27: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను శారీరకంగా, మానసికంగా శిక్షించడం నేరమని పాఠశాల విద్యాశాఖ హెచ్చరించింది. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టర్ అరివొళి, ప్రాథమిక విద్య డైరెక్టర్ కన్నప్పన్ పాఠశాలలకు సర్క్యులర్ పంపారు. విద్యార్థులను శారీరకంగా, మానసికంగా శిక్షించడాన్ని అడ్డుకొనేలా జిల్లా స్థాయిలో పర్యవేక్షణ బృందాలు ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. కుల, మతాలు, వేరే ఇతరత్రా కారణాలతో విద్యార్థులను వేరుగా చూడడం నేరమని తెలిపారు. ఈ మార్గదర్శకాలను అందరు ఉపాధ్యాయులు పాటించాలన్నారు. ఇలాంటి ఫిర్యాదులందే ప్రైవేటు పాఠశాలల అంగీకారం రద్దు చేసే అవకాశముందని సర్క్యులర్‌లో హెచ్చరించారు.

తంగచ్చిమఠం ఆలయ కుంభాభిషేకంలో వెల్లివిరిసిన మతసామరస్యం



క్రైస్తవులు, మహమ్మదీయులు సమర్పిస్తున్న సుగంధ ద్రవ్యాలు, ఫలపుష్పాలను స్వీకరిస్తున్న ఆలయ నిర్వాహకులైన హిందువులు

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపంలోని తంగచ్చిమఠం వద్ద శనివారం జరిగిన ఆలయ కుంభాభిషేక వేడుకల్లో హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు పాల్గొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. తంగచ్చిమఠంలో దశాబ్దాలుగా ఈ మూడు మతాల వారు అన్నదమ్ముల్లా మెలగుతున్నారు. ఎవరికీ ఏ కష్టమొచ్చినా పరస్పరం ఆదుకునే మనస్తత్వంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో తంగచ్చిమఠం రాజానగర్‌లో కొత్తగా రాజపెరియ కరుప్పసామి, రాక్కాసి అమ్మన్ ఆలయ కుంభాభిషేక వేడుకలు రెండు రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం ఆలయ రాజగోపురాలను పవిత్ర నదీ జలాలలో సంప్రోక్షణ జరిగింది. ఆ సందర్భంగా ఆ ప్రాంతంలో క్రైస్తవులు, ముస్లింలు మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి సమర్పించేందుకు పండ్లు, పూలమాలలు సుగంధ ద్రవ్యాలను మోసుకెళ్ళారు. ఆలయం వద్ద ఈ రెండు మతాల వారిని హిందూ మతపెద్దలు, ఆలయ ప్రధానార్చకులు సాదరంగా స్వాగతించి ఆలయం లోపలకు తీసుకెళ్ళారు. ఆ తర్వాత మూలవిరాట్టు వద్ద క్రైస్తవులు, ముస్లింలు ఊరేగింపుగా తీసుకువచ్చిన ఫలపుష్పాది ద్రవ్యాలను సమర్పించారు. ఆ తర్వాత ఆలయరాజగోపురాలపై పవిత్రజలాల సంప్రోక్షణ సందర్భంగా భక్తులపై ఆ జలాలను చల్లారు. పవిత్ర జలాలు పడగానే క్రైస్తవులు, ముస్లింలు భక్తితో నమస్కరించారు. ఆ తర్వాత ఆలయ ప్రసాదాన్ని కూడా మూడు మతాల వారు సహపంక్తిలో కూర్చుని స్వీకరించారు.

ఓమలూరు సంతలో జోరుగా మేకల అమ్మకం



సంతలో మేకలు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఓమలూరు సంతలో శనివారం మేకలు, పొట్టేళ్ల అమ్మకాలు జోరుగా సాగాయి. ఈ సంతలో జీవాలను కొనేందుకు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు వెళతారు. ప్రతి శనివారం నిర్వహించే సంతలో రైతులు పెంచే మేకలను ఈ వ్యాపారులు పోటీపడి అధిక ధరలకు కొగనులోలు చేస్తారు. శనివారం ఉదయం ప్రారంభమైన సంతలో తెల్ల మేకల ధర రూ.10వేల నుండి రూ.30 వేల వరకూ అమ్ముడయ్యాయి. పొట్టేళ్లు వాటి బరువులను బట్టి రూ.10వేల నుంచి రూ.25 వేల ధరకు విక్రయించారు. వేకువజాము ఐదు గంటలకు ప్రారంభమైన ఈ సంతలో జీవాల అమ్మకాలు ఉదయం ఎనిమిది గంటలలోపే పూర్తయ్యాయి.

లోక్ అదాలత్‌పై ప్రజల్లో పెరిగిన అవగాహన

సుప్రీంకోర్టు జడ్జి సంజీవ్ ఖన్నా

ప్యారీస్, ఏప్రిల్ 27: దేశంలో ఉన్న అన్ని గ్రామాల్లో లోక్ అదాలత్‌పై అవగాహన పెరిగిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ శాఖ, చట్టాలపై ప్రత్యేక సదస్సు ఏర్పాటుచేశారు. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్వీ గంగాపూర్‌వాలా అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం ఈ సదస్సును సుప్రీంకోర్టు న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ప్రారంభించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో జిల్లా న్యాయస్థానాల్లో ఒక న్యాయమూర్తి 25,129 కేసులు, హైకోర్టులో 2,636 కేసులు, సుప్రీంకోర్టులో 1,548 కేసులు విచారణ జరిపి పరిష్కరింపజేయాల్సి ఉందన్నారు. దేశంలో లోక్ అదాలత్ ద్వారా 2023వ సంవత్సరం సుమారు 6 కోట్లకు పైగా కేసులు పరిష్కరింపజేసినట్లు తెలిపారు. ప్రస్తుతం దేశంలోని అన్ని గ్రామాల్లోని ప్రజల్లో లోక్ అదాలత్‌పై అవగాహన పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఆర్.మహాదేవన్, పుదుచ్చేరి న్యాయపనుల కమిషన్ ఛైర్మెన్, న్యాయమూర్తి కృష్ణకుమార్ సహా పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

విచారణ పేరుతో చిత్రహింసలు...


నలుగురు పోలీసులకు జరిమానా

ప్యారీస్, ఏప్రిల్ 27: విచారణ పేరుతో ఇద్దర్ని చిత్రహింసలకు గురిచేసిన నలుగురు తిరునల్వేలి పోలీసులకు రూ. లక్ష జరిమానా విధిస్తూ మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. 2019 ఆగస్టులో తిరునల్వేలిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్న మారిముత్తు భార్య పేచియమ్మాళ్‌ను పరామర్శించేందుకు ఆమె సోదరుడు ముత్తుకుమార్ తల్లిదండ్రులతో కలసి వెళ్లాడు. అప్పుడు మారిముత్తు, ముత్తుకుమార్ మధ్య జరిగిన వాగ్వివాదం ఘర్షణకు దారితీసింది. దీనికి సంబంధించి ఆస్పత్రి యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిద్దరిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్న నలుగురు పోలీసులు, పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసల పాలు చేసినట్లు బాధితులు మానవ హక్కుల కమిషన్ ముందు మొరపెట్టుకున్నారు. విచారణ జరిపిన కమిషన్ సభ్యుడు వి.కన్నదాసన్, బాధితులకు నెల రోజుల్లోగా ప్రభుత్వం తలా రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని, సంబంధిత నలుగురు కానిస్టేబుళ్ల నుంచి తలా రూ.25 వేలు వసూలుచేసి, వారిపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు జారీచేశారు.

బెంగళూరు బాంబు పేలుడు కేసు... ట్రిప్లికేన్ లాడ్జిల్లో ఎన్ఐఏ తనిఖీ

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గత మార్చి ఒకటిన బెంగళూరు రామేశ్వరం కేఫ్‌లో సంభవించిన బాంబు పేలుడు కేసు నిందితులతో శనివారం నగరంలోని ట్రిప్లికేన్‌లోని మేన్షన్, లాడ్జిల్లో ఎన్ఐఏ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బెంగళూరు నుంచి భారీ పోలీసు బందోబస్తుతో బాంబు పేలుడు కేసు నిందితులు ముసావీర్ హుసైన్ సాహెబ్, అబ్దుల్ మతీన్ అహమ్మద్ తాహాను నగరానికి తీసుకువచ్చారు. వీరిద్దరు ఫిబ్రవరిలో ట్రిప్లికేన్‌లోని లాడ్జిల్లో బసచేసి బెంగళూరులో బాంబు పేలుడుకు పథకం వేసుకున్నారని ఎన్ఐఏ అధికారుల విచారణలో వెల్లడైంది. దీంతో వారిద్దరూ నెలరోజులపాటు నగరంలో ఏయే ప్రాంతాలకు వెళ్ళారనే విషయాన్ని ఆరా తీసేందుకు ఎన్ఐఏ అధికారులు శనివారం ట్రిప్లికేన్ లాడ్జిల్లో సోదాలు చేశారు.

బీడీ కార్మికురాలి కుమార్తె ఐఏఎస్!



తల్లితో ఇన్బా

పెరంబూర్, ఏప్రిల్ 27: తెన్‌కాశి జిల్లాకు చెందిన కార్మికురాలి కుమార్తె ఐఏఎస్‌కు ఎంపికైంది. యూపీఎస్సీ గత ఏడాది నిర్వహించిన పరీక్షా ఫలితా లు ఇటీవల విడుదల చేశారు. అందులో తెన్‌కాశి జిల్లా సెంగోట్టైకు చెందిన ఇన్బా అనే విద్యార్థిని ఉత్తీర్ణత సాధించింది. బీడీ కార్మికురాలి కుమార్తె అయిన ఇన్బా మాట్లాడుతూ... చిన్న వయస్సు నుంచే యూపీఎస్సీ పరీక్షలంటే ఆసక్తి ఉండేదన్నారు. తాను చదుకునేందుకు గ్రంథాలయం ఎంతో ఉపయోగపడిందన్నారు. ఇంట్లో ఏకాగ్రతతో చదవలేని పరిస్థితుల్లో గ్రంథాలయంలోనే చదువుకున్నానని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు యూపీఎస్సీ పరీక్షలంటేనే భయపడే పరిస్థితులున్నాయని, గ్రూప్ 1,2 తదితర పరీక్షలపై చూపే ఆసక్తి యూపీఎస్సీ పరీక్షల్లో చూపడం లేదన్నారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో చదివితే ఎలాంటి పరీక్షల్లోనైనా ఉత్తీర్ణత సాధ్యమని ఇన్బా తెలిపారు.



నీటితొట్టివద్ద గుర్రాలకు స్నానం చేయిస్తున్న సిబ్బంది

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రత్యేకం

గ్రేటర్ చెన్నై పోలీసు అశ్వదళం

సమ్మర్‌లో గుర్రాలకు ఏసీ సదుపాయం

రెండేళ్లలో శత వార్షికోత్సవాలు

గుర్రాలకు అందమైన తమిళ పేర్లు



గుర్రానికి ఫ్యాన్ గాలి



గుర్రాలకు సమ్మర్ స్పెషల్ దాణా సిద్ధం చేస్తున్న సిబ్బంది



గుర్రాన్ని ఆప్యాయంగా లాలిస్తున్న మహిళా సిబ్బంది

SUNDAY SPECIAL




అశ్వశాలలో వెదురుతడికలను నీటితో తడుపుతున్న సిబ్బంది



గుర్రాలకు షవర్‌బాత్ చేయిస్తున్న సిబ్బంది



నీటిని తాగుతున్న గుర్రాలను తిలకిస్తున్న పోలీసు అధికారి



అశ్వశాలపై నీటిని చల్లుతున్న సిబ్బంది

సమ్మర్‌లో ఏసీలు, షవర్‌బాత్‌లు...

ప్రస్తుతం వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో పోలీసు దళం అశ్వాలకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఎండ వేడి తట్టుకునేలా ఎలాంటి వ్యాధులు రాకుండా ఈ అశ్వాలను సిబ్బంది కన్న బిడ్డల్లా సంరక్షిస్తుంటారు. ప్రస్తుతం ఈ అశ్వదళంలో ఉన్న 25 గుర్రాలకు వేర్వేరుగా అశ్వశాలలున్నాయి. వీటిలో ఏడు పాకలకు ఏసీ సదుపాయం సమకూర్చారు. ఎండవేడి భరించలేక అలసిపోయే అశ్వాలను షిఫ్ట్ పద్ధతిలో ఈ ఏసీ పాకల్లోకి తరలిస్తుంటారు. ఇక గుర్రాలను స్నానం చేయించడానికి ప్రత్యేకంగా షవర్‌బాత్ సదుపాయం కూడా ఉంది. ఈ వేసవిలో షవర్‌బాత్ చేయడానికి ఈ అశ్వాలు పోటీపడుతుంటాయి. ఇక ఈ గుర్రాలకు వేసవిని తట్టుకునేటువంటి ఆహార పదార్థాలను తయారు చేసి అందిస్తున్నారు. ఆ మేరకు రోజూ ఉదయం ఆరుగంటలకు ఒకసారి, మళ్ళీ ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం మూడు గంటలకు సాయంత్రం ఆరుగంటలకు ఇలా నాలుగు పూటలా వీటికి చక్కటి ఆహారపదార్థాలను సమకూర్చుతున్నారు. క్యారెట్లు, ఆకు కూరలు, ముడిశెనగలు, పండ్లు, గ్లూకోస్, ఓట్స్ కలిపి గుర్రాలకు దాణాగా అందిస్తారు. అప్పుడప్పుడు ఐస్ ముక్కలు కలిపిన దాణాను కూడా పెడతారు. ఇక వారానికి ఒక పర్యాయం ఈ అశ్వాలను వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్ళి వైద్యపరీక్షలు కూడా నిర్వహిస్తారు. ఇలా నగర పోలీసు అశ్వదళంలోని గుర్రాలను సిబ్బంది తమ కన్న పిల్లలకంటే మిన్నగా కంటికి రెప్పలా కాపాడుతున్నారనటం అతిశయోక్తి కాదు.



ఐస్ గడ్డలను పగులగొడుతున్న సిబ్బంది

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసు శాఖలో అశ్వదళం కూడా నగరంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. అత్యంత ప్రాచీనమైన మద్రాసు పోలీసు అశ్వదళం మరో రెండేళ్లలో శతవార్షికోత్సవాలను జరుపుకోనుంది. ఆ వేడుకల నిర్వహణకు హోంమంత్రిత్వ శాఖ నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ రూ. 3 కోట్ల మేర నిధులు విడుదల చేశారు. ఈ పోలీసు అశ్వ దళాన్ని ఆంగ్లేయుల కాలంలో 1926లో 54 మేలి రకం అశ్వాలతో ఏర్పాటు చేశారు. నాటి పోలీసు ఉన్నతాధికారులు ఈ అశ్వాలనే ఉపయోగించేవారు. అప్పట్లో మౌంట్‌రోడ్‌గా పిలిచిన అన్నాసాలై ప్రధాన రహదారుల్లో, మెరీనాబీచ్‌లో ఈ అశ్వదళం గస్తీ నిర్వహించేది. ప్రస్తుతం నగరంలో అల్లర్లు, ఘర్షణలు సంభవిస్తే పోలీసులు గుర్రాలపై స్వారీ చేసుకుంటూ సంఘటన స్థలానికి చేరితే చాలు పరిస్థితి అదుపులోకి వచ్చేస్తుంది. ఇక మెరీనాబీచ్‌లో రోజూ ఉదయం, సాయంత్రం ఈ అశ్వదళం గుర్రాలను పోలీసులు అత్యంత వేగంగా పరుగులు తీయిస్తారు. ఈ స్వారీ చేయడం ద్వారా ఇటు గుర్రాలకు, అటు కానిస్టేబుళ్లకు చక్కటి వ్యాయామంగా ఉంటుంది. ప్రస్తుతం పోలీసు శాఖలో సాంకేతిక పరంగా, నిర్వహణపరంగా ఎన్నో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నప్పటికీ ఈ పోలీసుఅశ్వదళం మాత్రం తన ప్రాచీన సంప్రదాయ ఉనికిని ఏ మాత్రం కోల్పోలేదు. నగర పోలీసులకు ఈ అశ్వదళం అన్ని విధాలా అండగానే ఉంటోంది. ప్రపంచంలోనే అత్యంత పొడవైన బీచ్‌ల్లో రెండవదైన మెరీనాబీచ్‌లో బందోబస్తు కోసం ఈ అశ్వదళం ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. స్వాతంత్ర్య దినం, గణతంత్ర్య దినం తదితర జాతీయ వేడుకల్లో ఈ అశ్వదళం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అశ్వదళం కవాతు ఎల్లప్పుడూ చూపరులకు కనువిందు చేస్తుంది. నగరంలో జరిగే వినాయక నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాల్లో ఈ పోలీసు అశ్వ దళం కీలక పాత్ర పోషిస్తోంది. పోలీసు వాహనాలు ప్రవేశించలేని ఇరుకైన వీధుల్లోనూ ఈ అశ్వాలు మెరుపువేగంతో పరుగులు తీయగలవు. ఇక ప్రతియేటా ఐలాండ్ గ్రౌండ్స్‌లో జరిగే అంతర్జాతీయ వస్తు ప్రదర్శనలో పోలీసు శాఖ తరఫున ఏర్పాటయ్యే స్టాళ్లలో ఈ అశ్వాలను అందమైన రంగురంగుల దుస్తులతో అలంకరించి నిలబెడతారు. ప్రస్తుతం ఈ పోలీసు అశ్వదళం పలు క్రీడల్లోనూ సత్తా చాటుకుంటోంది. ఇటీవల నగరంలో పోలీసు అశ్వాల కోసం జరిగిన క్రీడాపోటీల్లో చెన్నై పోలీసు అశ్వదళానికి చెందిన అశ్వాలు బహుమతులు గెలుచుకున్నాయి. ఇలా ఈ అశ్వదళం పోలీసు శాఖకు అత్యవసర సమయాల్లో సాయం చేసే దళంగాను పేరుగడిస్తోంది.

25 అశ్వాలు..

ఈ పోలీసు అశ్వదళంలో ప్రస్తుతం 12 ఆడ గుర్రాలు, 13 మగ గుర్రాలు చొప్పున కలిపి మొత్తం 25 గుర్రాలున్నాయి. నగరంలో పోలీసు కమిషనర్ పాత కార్యాలయ ప్రాంగణంలో ఈ పోలీసు అశ్వదళానికి స్థిర నివాసప్రాంతంగా ఉంది. ఈ ప్రాంగణంలో 40 గుర్రాలుండేందుకు తగిన సదుపాయాలున్నాయి. త్వరలో శతవార్షికోత్సవం జరుపుకోనున్న తరుణంలో కొత్తగా ఐదు మేలి రకం గుర్రాలు ఈ అశ్వదళంలో చేరనున్నారు. ఢిల్లీలోని సైనిక శిబిరం నుంచి ఈ కొత్త గుర్రాలను లక్షలాది రూపాయలను వెచ్చించి కొనుగోలు చేయనున్నారు. ముఖ్యమంత్రి విడుదల చేసిన రూ.3 కోట్లతో పాత అశ్వశాలలను కూల్చివేసి కొత్తది నిర్మించనున్నారు. ఈ పోలీసు అశ్వదళాన్ని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ స్వీయపర్యవేక్షణలో ప్రధాన కార్యాలయం అదనపు పోలీసు కమిషనర్ కపిల్‌కుమార్ సి.శరద్కర్, డిప్యూటీ కమిషనర్ కయల్‌విళి, అసిస్టెంట్ కమిషనర్ రాధాకృష్ణన్ సంయుక్తంగా నిర్వర్తిస్తున్నారు. ఈ అశ్వదళాన్ని కంటికి రెప్పలా కాపాడటంలో సీఐ కుమార్, ఎస్‌ఐ పాండి నాయకత్వంలో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్ల సహా 19 మంది సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ అశ్వాలకు స్నానాలు చేయించడం, దాణా అందించటం వంటి పనులకు ప్రత్యేక సిబ్బంది కూడా ఉన్నారు. ఈ అశ్వదళానికి ఎనిమిదేళ్ల వయస్సున్న గుర్రాలను కొనుగోలు చేసి, వాటికి సునిశిత శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత 20 యేళ్ళవరకు ఈ గుర్రాలను పోలీసుల దళంలో పనిచేయడానికి అనుమతిస్తారు. 20 యేళ్ల రాగానే గుర్రాలకు వీడ్కోలు కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. తర్వాత ఆ గుర్రాలను నగరంలోని స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తారు. ఆ సంస్థలలో గుర్రాలు తమ శేష జీవితాన్ని ప్రశాతంగా గడుపుతాయి.



గుర్రాలను షవర్‌బాత్ కోసం తీసుకెళుతున్న సిబ్బంది

అశ్వాలకు అందమైన పేర్లు..

పోలీసు దళంలో సేవలందించిన గుర్రాలకు గతంలో ఆంగ్లంలో పేర్లుండేవి. ప్రసుతం వీటికి అందమైన తమిళ పేర్లు పెట్టి పిలుస్తున్నారు. కంబన్, చోళన్, పాండ్యన్, ఆదిత్య అంటూ తమిళ పేర్లతో పిలుస్తున్నారు. వీటిలో చాలా మోటుగా ప్రవర్తించే గుర్రాన్ని 'కబాలి' అనే పేరుతో పిలుస్తున్నారు. ఆడ గుర్రాలకు కూడా వైగై, కావేరి, తామ్రభరణి అంటూ నదుల పేర్లతో పలిస్తున్నారు. ఈ అశ్వాలకు నామకరణ మహోత్సవాలు నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో జరగుతుంటాయి. గ్రేటర్‌చెన్నై పోలీసు కమిషనరేట్‌లో అందమైన దుస్తులు వేసి అశ్వాలను తీసుకెళతారు. పోలీసు కమిషనర్ ఆ గుర్రాలను పరిశీలించి ఆప్యాయంగా వాటిని నిమురుతూ పేర్లు పెడతారు. కొంతమంది అశ్వదళానికి ఆంగ్ల పేర్లతో చెలామణీ అవుతున్న గుర్రాలను దానంగా ఇస్తుంటారు. ఆ గుర్రాలకు కూడా పాత పేర్లను మార్చి తమిళ పేర్లు పెట్టి పిలుస్తారు.



ప్రియుడు సంతానుతో శృతిహాసన్

ప్రియుడి నుంచి శృతిహాసన్ ఎడబాటు?

చిత్రజ్యోతి

విశ్వనటుడు కమల్‌హాసన్ కుమార్తెగా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన శృతిహాసన్ ఆ తర్వాత తన నటనతో పాటు గ్లామర్‌తో తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపుతో పాటు మార్కెట్‌ను సొంతం చేసుకుని తండ్రికి తగ్గ తనయురాలిగా గుర్తిపు పొందారు. కేవలం హీరోయిన్‌గా మాత్రమేకాకుండా, మల్టీటాలెంటెడ్ ఆర్టిస్ట్‌గా ఆమె చిత్రపరిశ్రమలో రాణిస్తున్నారు. ఇటీవల యంగ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్‌తో కలిసి నటించిన 'ఇని మేల్' సింగిల్ ఆల్బమ్ ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా ఇందులో యాక్షన్ డైరెక్టర్ లోకేష్‌తో శృతి హాసన్ చేసిన రొమాన్స్ ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచింది. ఇదిలావుంటే, టాటూ కళాకారుడు సంతానుతో గత కొంతకాలంగా సహజీవనం చేస్తూ వచ్చిన శృతిహాసన్.. తమ కుటుంబ పెద్దల అంగీకారంతో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే, ఇపుడే ఈ ప్రేమజంట విడిపోనుందనే వార్తలు వస్తున్నాయి. దీనికి కారణం... గత కొన్ని రోజులుగా వీరిద్దరు ఇన్‌స్టా ఖాతాలను ఫాలో కాకపోవడం, ఒకరి ఫొటోలు ఒకరు షేర్ చేయడం లేదు. దీంతో వీరిద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో విడిపోనున్నారనే ప్రచారం సాగుతుంది.



సంతానం - ప్రియాలయ

సింగిల్‌గా ఉండేందుకు నేను శింబునా? : హీరో సంతానం

ఎల్లవేళలా సింగిల్‌గా ఉండేందుకు నేను ఏమైనా శింబునా? అని హీరో సంతానం అంటున్నారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'ఇంగ నాన్‌దాన్ కింగు'. వచ్చే నెల పదో తేదీన విడుదలకానుంది. సంతానం సరసన ప్రియాలయ నటించగా, ఇతర పాత్రల్లో తంబి రామయ్య, వివేక్ ప్రసన్న, బాల శరవణన్, మునీష్‌కాంత్, మారన్, శేషు, స్వామినాథన్, కూల్ సురేష్ తదితరులు కనిపించనున్నారు. గోపురం ఫిలిమ్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం ట్రైలర్ తాజాగా రిలీజ్ చేశారు. 'నడిగర్ సంఘం భవన నిర్మాణం పనులు పూర్తి చేశాకే వివాహం చేసుకుంటానని చెప్పడానికి నేనేమైనా విశాల్‌నా.? ఎపుడూ సింగిల్‌గా సరదాగా తిరిగేందుకు నేనేమైనా శింబునా' అంటూ హీరో సంతానం చెప్పే పంచ్ డైలాగులు, తంబి రామయ్య కామెడీ టైమింగ్ ట్రైలర్‌తో ప్రధానంగా చూపించారు. సినిమా పూర్తిగా హాస్యభరితంగా తెరకెక్కించినట్టుగా తెలుస్తుంది. డి.ఇమ్మాన్ నేపథ్య సంగీతం ట్రైలర్‌లో స్పష్టంగా తెలుస్తుంది. ట్రైలర్ ఆఖరులో హీరో యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆలరిస్తున్నాయి.

'కంగువా' బడ్జెట్ రూ.350 కోట్లా?



'కంగువా'లో సూర్య

చిరుత్తై శివ దర్శకత్వంలో హీరో సూర్య నటిస్తున్న 'కంగువా' చిత్రం నిర్మాణ వ్యయంపై ఇపుడు సినీ పరిశ్రమలో ఆసక్తికరమైన చర్చ సాగుతుంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.350 కోట్ల మేరకు ఖర్చు చేసినట్టు వినికిడి. యూవీ క్రియేషన్స్‌తో కలిసి కేఈ జ్ఞానవేల్ రాజా తన నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ పతాకంపై ఈ సినిమాను తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళంతో పాటు ఏకంగా 10కి పైగా భాషల్లో రూపొందిస్తున్నారు. బాలీవుడ్ నటి దిశా పటానీ హీరోయిన్. ఇతర పాత్రల్లో బాబీ డియోల్, యోగిబాబు, రెడిన్ కింగ్స్లే తదితర ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. వెట్రి పళనిస్వామి ఛాయాగ్రహణం సమకూర్చగా దేవీశ్రీ ప్రసాద్ సంగీతం. సూర్య ద్విపాత్రాభినయం చేసే ఈ సినిమా ట్రైలర్ ఇటీవల విడుదల చేశారు. చరిత్రకు ముందుకాలంలోనూ సమకాలీన కాలాల్లో జరిగినట్టుగానే ఈ కథ సిద్ధం చేశారు. ఇందులోని యుద్ధ సన్నివేశాలు భయపెట్టేలా చిత్రీకరించారు. ఈ ప్రాజెక్టు కోసం నిర్మాణ సంస్థలు ఏకంగా రూ.350 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు ప్రచారం జరుగుతుంది.



'ఇండియన్-2'లో ఓ దృశ్యం

మే మూడో వారంలో 'ఇండియన్-2' గ్రాండ్ వేడుక!

విశ్వనటుడు కమల్ హాసన్ - శంకర్ కాంబినేషన్‌లో రానున్న చిత్రం 'ఇండియన్-2' జూన్ నెలలో విడుదల చేసేందుకు ప్లాన్ చేశారు. 28 యేళ్ళ క్రితం వచ్చిన 'ఇండియన్'కు సీక్వెల్ అయిన ఈ చిత్రం ప్రచార కార్యక్రమాలను నిర్మాణ సంస్థలు ప్రారంభించాయి. 'తాతా వరారు.. తాతా వరారు' అంటూ సాగే పాటను అనిరుధ్ రవిచంద్రన్ నేపథ్యగానం చేశారు. ఈ సింగిల్ సాంగ్ విడుదల చేసేందుకు భారీ సన్నాహాలు చేస్తున్నారు. మే మూడో వారంలో నగరంలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో గ్రాండ్‌గా రిలీజ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, సిద్ధార్థ్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, సముద్రఖని, బాబీ సింహా, ఢిల్లీ గణేష్, జయప్రకాష్, గురు సోమసుందరం తదితరులు నటిస్తున్నారు.



ఏర్కాడు సరస్సులో పడవ సవారీ

ఏర్కాడులో పెరిగిన పర్యాటకుల రద్దీ

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో పేదల ఊటీగా పేరుగడించిన ఏర్కాడులో వారాంతపు సెలవుల కారణంగా పర్యాటకుల రద్దీ పెరిగింది. ప్రస్తుతం సేలం జిల్లా అంతటా పగటి పూట వడగాడ్పులు వీస్తున్నాయి. దీంతో ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు ఇంటిపట్టునే గడుపుతున్నారు. ఎండలు రోజురోజుకూ అధికమవుతుండటంతో ప్రజలు కుటుంబ సమేతంగా ఊటీ, కొడైకెనాల్ తదితర పర్యాటక ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇదే విధంగా ఏర్కాడు ప్రాంతానికి కూడా గత నాలుగు రోజులుగా వివిధ జిల్లాల నుంచి వందల సంఖ్యలో పర్యాటకులు తరలివెళ్ళారు. దీంతో బోట్‌సఫారీ ప్రాంతం, ఉద్యానవనాల వద్ద పర్యాటకుల సందడి అధికమైంది. బాలబాలికలు ఉద్యానవనాలలో సేదతీరారు. ఇదే విధంగా ఏర్కాడు అంతటా పర్యాటకుల సంచారం అధికమైంది. ఉద్యానవనాలలో ప్రస్తుతం డేలియా పుష్పాలు విరబూయటంతో పర్యాటకులు వాటి ముందు సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. పర్యాటకుల సంఖ్య అధికం కావటంతో అక్కడి వసతిగృహాల్లోని అన్ని గదులు బుక్ కావటంతో పర్యాటకులు బసకోసం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



గార్డెన్‌లో పుష్పాలను తిలకిస్తున్న పర్యాటకులు



మిరియాల నారాయణ

● మా రోజుల్లో...

రాజకీయాలు నీతిగా ఉండేవి

నా వయసిపుడు 90 ఏళ్లు. మా నాయిన మిరియాల గోవిందయ్య స్వాతంత్ర్య సమరయోధుడు. ఓ దఫా జైలుకెళ్లాడు. నాయుడుపేట చావిడికి నెహ్రూ వస్తే ఆయనతో సమావేశం ఏర్పాటు చేశాడు. ఎన్టీరామారావు తెలుగుదేశం పార్టీ పెడితే నన్ను పెద్దలంతా నాయుడుపేట పట్టణ అధ్యక్షుడిగా చేశారు. 20 ఏళ్ల పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడుగా, పంచాయతీ బోర్డు మెంబరుగా, ఎంపీటీసీగా పనిచేశాను. అప్పట్లో ఎన్నికలకు డబ్బులిచ్చే వారు కారు. డబ్బుకు ఆశపడే నాయకులూ లేరు. ఓట్లు కొనడాలు లాంటివి మాకు తెలీదు. ఓట్లకోసం ఇంటింటికీ తిరిగేవాళ్లం కాదు. పార్టీ జెండా పటుకుని వీధుల్లో తిరిగేవాళ్లం. 10 మంది సైకిళ్లమీదో, బస్సుల్లోనో వెళ్లి నామినేషన్లు వేసేవాళ్లం. 20 యేళ్లుగా చూస్తున్నా.. రాజకీయాలు యాపారంగా మారిపొయినాయి. గందరగోళంగా, గొడవలుగా ఉన్నాయి.

- మిరియాల నారాయణ, నాయుడుపేట

-నాయుడుపేట

ఓటేయాలంటే 4.5 కి.మీ నడవాల్సిందే!



కోట మండలం కొత్తపట్నం పంచాయతీలో గోవిందపల్లిపాళెం సముద్రపు ఒడ్డున ఉంది. ఈ గ్రామంలో సుమారు 420 కుటుంబాలున్నాయి. 475 మంది ఓటర్లున్నారు. ఎలక్షన్లు వస్తే 4.5 కిలోమీటర్లు నడిచి గోవిందపల్లిలోని పోలింగ్ స్టేషన్‌లో ఓటువేసి వస్తుంటారు. తమ గ్రామంలో పోలింగ్ బూత్ పెట్టాలనే కోరిక నెరవేరడం లేదు. గ్రామానికి మధ్యలో ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ కొన్నిసార్లు అటుపోట్లు ఎదురై కన్నెర్రచేస్తే వీరి కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆ కెనాల్‌ను దాటుకొని అవతలి ఒడ్డుకు వచ్చి ఓటు వేయాల్సిందే. ఐదేళ్లకోసారి నాయకులు వచ్చి హామీ ఇవ్వడం, తర్వాత అమలు చేయకపోవడం తమకు అలవాటైపోయిందని ఇక్కడి మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-కోట

ట్రెండ్ మారింది

గాడ్‌ఫాదర్లు పోయె!

సూళ్లూరుపేట రిజర్వుడు నియోజకవర్గంలో ఒకప్పుడు గాడ్‌ఫాదర్‌ల హవా నడిచేది. పార్టీ ఏదైనా స్థానిక భూస్వాముల మాటే నడిచేది. అట్లా రెండు కుటుంబాలు సూళ్లూరుపేట శాసనసభ్యులుగా ఎవరు ఉండాలో నిర్ణయించేవి. వారు చెప్పినవారికే టికెట్లు కేటాయించేవారు. 1960ల్లో కోట పోలూరుకి చెందిన బద్దెపూడి పేరారెడ్డి మాటే శాసనంగా నడిచేది. ఆయన చెప్పినవారికే కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించేది. అయితే 1967లో పిట్ల వెంకటసుబ్బయ్య పేరును కాంగ్రెస్ అధిష్టానానికి పేరారెడ్డి సూచించారు. ఎందుకనో కాంగ్రెస్ అమోదించలేదు. పార్టీ అభ్యర్థిగా మేర్లపాక మునస్వామిని పోటీకి నిలిపింది. దీంతో తిరగబడ్డ బద్దెపూడి పేరారెడ్డి అదే పిట్ల వెంకటసుబ్బయ్య చేత ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేయించారు. ఆ ఎన్నికల్లో అన్నీ తానై కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించి తన పంతం నెగ్గించుకున్నారు. ఖంగుతిన్న కాంగ్రెస్, ఆ తర్వాత పేరారెడ్డి దారిలోకి వచ్చింది. పిట్ల వెంకటసుబ్బయ్యను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత సీను మారింది. వేనాటి కుటుంబం నిరయాత్మక పాత్ర పోషించింది. వేనాటి మునిరెడ్డి, ఆయన మరణం తర్వాత ఆయన సోదరుడు వేనాటి రామచంద్రారెడ్డిల మాటే టీడీపీ అధిష్టానం వినేది. వారు సూచించినవారికే టీడీపీ టికెట్ లభించేది. 2019 తర్వాత పరిస్థితి మారిపోయింది. గాడ్‌ఫాదర్‌ల మీద పార్టీలు ఆధారపడడం లేదు. ఒకరిద్దరు నాయకులు అటువంటి పాత్ర పోషించే ప్రయత్నాలు చేసినా పార్టీలు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. సొంత సర్వేలు నిర్వహించుకుని దాని ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నారు. గెలిచిన తర్వాత ఎమ్మెల్యేలుగా గెలిచినవారు కూడా గాడ్‌ఫాదర్‌ల చెప్పుచేతల్లో ఉండడానికి ఇష్టపడడం లేదు. స్వతంత్రంగా వ్యవహరించడంతో గాడ్‌ఫాదర్‌లకు ఆగ్రహం కలిగినా ఏమీ చేయలేని అసహాయతలో పడిపోయారు. ఈ పరిణామాలు గాడ్‌ఫాదర్‌లను కనుమరుగు చేసేశాయి.

- తడ




జన కేతనం

మూలిగే నక్కపై తాటి కాయ పడ్డట్లు ఉంది వైసీపీ వర్గాల పరిస్థితి. ఇప్పటికే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండగా, శనివారం సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో మరింత నిరాశ పర్చింది. టీడీపీ అధినేత చంద్రబాబు కొన్ని నెలల కిందట ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పోల్చుకుని వైసీపీ వర్గాలే పెదవి విరుస్తున్నాయి. సంక్షేమ పథకాల లబ్ధి జగన్ కన్నా చంద్రబాబు అధికారంలోకి వస్తేనే ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయం ఏర్పడుతోంది. గత ఐదేళ్ల కన్నా అధికంగా ప్రయోజనం ఉంటుందని పెన్షనర్లు, రైతులు, మహిళలు ఆశపడ్డారు. జగన్ వారి ఆశలు భగ్నం చేశారు. జగన్ మేనిఫెస్టోను టీడీపీ మేనిఫెస్టోతో పోల్చి చూస్తే.. చంద్రబాబు అధికారంలోకి వస్తే జిల్లాలో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఐదేళ్లలో రూ.4 వేల కోట్లకు పైగా లబ్ధి చేకూరనుంది. వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో, టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో జిల్లా ప్రజలకు కలిగే లాభనష్టాల వివరాలిలా ఉన్నాయి. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

జగన్ మేనిఫెస్టో తుస్స్స్!

ఆందోళనలో వైసీపీ వర్గాలు



పెన్షన్లు

చంద్రబాబు హామీ: అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకూ పెన్షన్ రూ. 4000లు చేస్తాం. ప్రస్తుతం రూ. 3000లు పెన్షన్ పొందుతున్నవారికి ఏప్రిల్ నుంచే పెంచిన రూ. 1000లు కూడా చెల్లిస్తాం.

జగన్ మేనిఫెస్టో: పెన్షన్‌లు 2028లో రూ. 250లు, 2029లో మరో రూ. 250లు పెంచుతాం.

జగన్ వల్ల రూ.1628 కోట్ల నష్టం



చంద్రబాబు ఇస్తానన్న నాలుగువేల పెన్షన్‌తో పోలిస్తే జగన్ అధికారంలోకి వస్తే జిల్లాలోని 2,71,477 మంది పెన్షన్‌దారులు నెలకు రూ.వెయ్యి చొప్పున రూ. 27.41 కోట్లు నష్టపోనున్నారు. అదే ఏడాదిలో అయితే రూ. 325.77 కోట్లు.. ఐదేళ్లకు ఏకంగా రూ. 1628.86 కోట్ల అదనపు లబ్ధిని పోగొట్టుకోనున్నారు. వ్యక్తిగతంగా చూస్తే ఒక్కో పెన్షనర్ ఏడాదికి రూ. 12 వేలు, ఐదేళ్లలో రూ. 60 వేలు చొప్పున నష్టపోనున్నారు.

గతంలో : జగన్ అధికారంలోకి వచ్చేప్పటికి పెన్షన్ రూ.2000 ఉంది. అంతకుముందు టీడీపీ అధికారం చేపట్టినపుడు కేవలం రూ. 200 మాత్రమే ఉండేది. దానిని చంద్రబాబు రూ. 2000లకు పెంచారు. జగన్, అధికారంలోకి వచ్చాక అవ్వాతాతలకు రూ.3000 లు చేస్తానని చెప్పి అంచలంచెలుగా రూ. 250 వంతున పెంచి రూ. 3000లు చేశారు.

సిలిండర్లు

చంద్రబాబు హామీ: టీడీపీ అధికారంలోకి వస్తే ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ప్రతి ఇంటికీ ఉచితంగా ఇస్తాం.

జగన్ మేనిఫెస్టో: ఉచితంగా సిలిండర్లు ఇచ్చే ఆలోచనే లేదు.



టీడీపీ వస్తే గ్యాస్ రూపేణా రూ.883.59 కోట్ల లబ్ధి

జిల్లాలో తెల్ల రేషన్ కార్డు కలిగిన 5.89 లక్షల వంట గ్యాస్ వినియోగించే కుటుంబాలున్నాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే వీరికి ఏడాదికి రూ.176.71 కోట్లు.. ఐదేళ్లలో రూ.883.59 కోట్ల లబ్ధి చేకూరనుంది. వ్యక్తిగతంగా ఒక్కో కుటుంబం ఏడాదికి రూ.3 వేలు, ఐదేళ్లలో రూ.15 వేలు ప్రయోజనం పొందనుంది. వైసీపీ అధికారంలోకి వస్తే ఈ మొత్తాన్ని నష్టపోవాల్సిందే.


రైతులకు

చంద్రబాబు హామీ: అధికారంలోకి రాగానే అన్నదాత పథకం కింద ఒక్కొక్కరికీ రూ. 20 వేలు వంతున ఇస్తాం.


జగన్ మేనిఫెస్టో: రైతు భరోసాను రూ. 16 వేలుకి పెంచుతాం.

361కోట్ల నష్టం

జిల్లాలో 1,80,654 మంది రైతులున్నారు. జగన్ తిరిగి సీఎం అయితే వీరు ఏడాదికి రూ.72.76 కోట్లు.. ఐదేళ్లలో రూ.361.30 కోట్లు కోల్పోనున్నారు. వ్యక్తిగతంగా లెక్కిస్తే ప్రతి రైతూ ఏడాదికి రూ.4 వేలు, ఐదేళ్లలో రూ. 20 వేలు వంతున నష్టపోనున్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలిచి చంద్రబాబు సీఎం అయితే అదే మొత్తం రైతులకు అదనపు లబ్ధికానుంది. **గతంలో:** రైతులకు రూ.14 వేలు ఇస్తానని గతంలో చెప్పిన జగన్.. రూ.13500 ఇస్తున్నారు. అందులో రూ.6 వేలు కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ యోజన నిధులే. అంటే జగన్ ఇచ్చేది రూ.7500 మాత్రమే.



ఆర్టీసీలో ఉచితం



చంద్రబాబు హామీ: అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం

జగన్ మేనిఫెస్టో: ప్రస్తావనే లేదు

టీడీపీ వస్తేనే మహిళలకు బస్సుల్లో ఉచితం

జిల్లాలో సుమారు 11 లక్షల మంది మహిళలున్నారు. వీరిలో ఉద్యోగ, ఉపాధి వంటి ఇతర పనుల కోసం నిత్యం ప్రయాణించేవారు లక్ష మంది ఉంటారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ సూపర్‌సిక్స్ పథకాల్లో ప్రకటించేసింది. వైసీపీ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు తాజాగా తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ఉచిత ప్రయాణ పథకం విజయవంతంగా అమలవుతోంది.

చదువుకు భరోసా

చంద్రబాబు హామీ: టీడీపీ అధికారంలోకి వస్తే అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎందరు పిల్లలున్నా ప్రతి పిల్లాడికీ రూ.15 వేలు చొప్పున అందిస్తాం.

జగన్ మేనిఫెస్టో: అమ్మఒడిని రూ.17లు వేలకు పెంచుతాం.

చంద్రబాబు గెలిస్తే రూ.1296 కోట్ల లాభం

ఈ ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తే తల్లులకు సుమారు రూ.1296 కోట్ల మేరకు ప్రయోజనం కలగనుంది. ఇంట్లో అందరు పిల్లలకు అమ్మఒడి కింద రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చెప్పిన జగన్.. ఆ తర్వాత ఒకరికే పరిమితం చేశారు. రూ.15 వేలలోనూ నిర్వహణ ఖర్చులంటూ కత్తిరించి రూ.13 వేలే ఖాతాల్లో వేస్తున్నారు. అదీ మధ్యలో ఒక సంవత్సరం ఎగ్గొట్టి.. నాలుగేళ్లే చెల్లించారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.17 వేలు చేస్తామని చెబుతున్నా అధికారంలోకి వచ్చాక అంతే ఇస్తారన్న నమ్మకం జనంలో లేదు. ఒకవేళ ఇచ్చినా ఆ మొత్తం కత్తిరింపులు పోనూ ఖాతాలో జమయ్యేది రూ. 15 వేలే కావచ్చు. కానీ చంద్రబాబు ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని మాటిచ్చారు. సగటున ఇద్దరు పిల్లలు ఉంటున్న నేపథ్యంలో ప్రతి కుటుంబానికి రూ.15 వేలు అదనపు లబ్ధి కలగనుంది. ఈ రకంగా చూస్తే జిల్లాలో సుమారుగా 1.72 లక్షల మంది తల్లులు ఇప్పుడు అమ్మఒడి పొందుతున్నారు. ఇదే సంఖ్యను తీసుకున్నా వీరికి ఏటా రూ.259 కోట్లు.. ఐదేళ్లలో ఏకంగా రూ.1296 కోట్ల లబ్ధి కలగనుంది. వ్యక్తిగతంగా లెక్కిస్తే ఒక్కో తల్లికి ఏటా రూ. 15 వేలు, ఐదేళ్లలో రూ. 75 వేలు ప్రయోజనం పొందనున్నారు. జగన్ గెలిస్తే ఈ మొత్తాన్ని నష్టపోవాల్సిందే.





ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతి నెహ్రూ నగర్‌లో శనివారం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు సరదాగా కాస్సేపు ఇస్త్రీ చేశారిలా..

ప్రచార శంఖారావం రావిళ్లవారిపల్లె

● ఎవరైనా రావిళ్లవారిపల్లె నుంచే ఎన్నికల ప్రచారం

చంద్రగిరి నియోజకవర్గంలో ఏ పార్టీ నాయకుడైనా రావిళ్లవారిపల్లె నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం శుభసూచకంగా నమ్ముతున్నారు. ఆర్‌సీపురం మండలానికి రావిళ్లవారిపల్లె ఈశన్యంలో ఉండటమే ఇందుకు కారణమట. సర్పంచ్ ఎన్నికలు మినహా మిగిలిన అన్ని ఎన్నికల ప్రచారానికి టీడీపీ, వైసీపీ పార్టీల నాయకులు రావిళ్లవారిపల్లె నుంచి ప్రచారం ప్రారంభించడం ఆనవాయితీగా మారింది. టీడీపీ ఆవిర్భావం తరువాత ముద్దు కృష్ణమనాయుడు ఇక్కడ నుంచే ప్రచారం ప్రారంభించేవారు. ఒకసారి మినహా ఐదు సార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ ఆనవాయితీని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా కొనసాగించారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో పులివర్తి నాని తనయుడు వినీల్ తన తండ్రిపక్షాన, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తమ్ముడు హర్షిత్‌రెడ్డి కూడా నెల క్రితం రావిళ్లవారిపల్లె నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

- రామచంద్రాపురం

సెంటిమెంట్



రావిళ్లవారిపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పులివర్తి వినీల్(ఫైల్) ←

పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్

ఇతర జిల్లాలో ఓటు హక్కు కలిగి ఈ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తిరుపతిలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సౌకర్యం కల్పించనున్నారు. ఇందుకోసం ఇందుకోసం ఫెసిలిటేషన్ సెంటర్ పెడుతున్నామని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విభజించి ఆదివారం వెలగపూడిలోని సీఈవో కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. భద్రత నడుమ ఉద్యోగుల బ్యాలెట్‌ను జిల్లాకు తీసుకురావాల్సి ఉంటుందని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల విధిలో ఉన్న ఇతర జిల్లాల ఉద్యోగులు మే 5, 6 తేదీల్లో బాలాజీకాలనీలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో వినియోగించుకోవాలని కోరారు.

- తిరుపతి(కలెక్టరేట్)